ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం వారి స్వర్ణోత్సవ కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# జమ్మిచెట్టు

"**అ**బ్బాయ్ స్వామీ. మే నెల రెండోవారంలో పండుగ ఉందిరా. నువ్వూ కోడలూ మనవణ్ణి తీసుకుని తప్పకుండా రావాలి. మీ నాన్నగారు మరీ మరీ చెప్పమన్నారు..."

"మేలో ఏం పండగ ఉందమ్మా?"

"మన కుటుంబ పండుగ... అమెరికా నుంచి రావాలి కదా. ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటారని రెండు నెలలు ముందుగా చెబుతున్నాం. తప్పకుండా రండి సుమా. నాలుగో ఏడు వచ్చేసినా మేమింకా మనవణ్ణి చూడనే లేదు కదురా...!" బాధగా అంది లలితాంబ.

గతుక్కుమన్నాడు స్వామి. "ఫ్యామిలీ ఫంక్షన్ అయితే ఎందుకు మిస్సవుతాం. ఖచ్చితంగా వస్తాం" అనేశాడు.

"ఇండియా రమ్మంటున్నారా? ఇప్పుడెందుకట? రానూపోనూ బోల్డు ఖర్చు. జీతం నష్టం. పైగా అక్కడ మే నెల ఎండలు. నిలువునా మాడిపోతాం!" ముఖం వికారంగా పెట్టుకుని అంది శ్యామల.

"రితీష్‌ని అమ్మా నాన్నా చూడలేదు. క్రితం నెలలో నాన్నగారికి హార్ట్ ఆపరేషన్ చేసినప్పుడూ మనం వెళ్ళలేదు....."

"అందుకని, ఇలా వంకపెట్టి రమ్మంటున్నారా?!"

"బహుశా పెనుగండం గడిచిందని నాన్నగారు హెూమం లాంటిదేదైనా చేస్తున్నారేమో. లేదా మ్యారేజ్ డేయో, బర్త్ డేయో అయ్యుండొచ్చు. ఈ మధ్య తరచూ నాన్నగారు కలలోకి వస్తున్నారు. చూడాలని నాకే ఎంతో ఇదిగా ఉంది. వాళ్ళకి ఉండదూ? మనం ఇండియా వెళ్తున్నాం. అంతే!"

ఆమె గుండెల్లో బండరాయి పడింది! రితీష్ వంక చూసింది. వాడొక్కడూ ఒక మూలన కూర్చుని ఆడుకుంటున్నాడు. తనలో తను ఏదో చెప్పుకుంటున్నాడు. ఆమె

మనసులో దిగులు ముసురు పట్టింది!

మర్నాడు ఆఫీసు నుంచి బెంగళూరులో ఉంటోన్న అన్నగారు రాఘవకి ఫోన్ చేశాడు స్వామి.

"మే నెలలో ఇంటికి రమ్మంటూ అమ్మ ఫోన్ చేసింది. ఎందుకన్నయ్యా?"

"నాకూ చేసింది. సంగతేవిటో నాకూ తెలీదు. అసలే ఎస్కలేషన్ అయ్యిందని ఛస్తున్నాం. ఇంక టూర్లకెలా రాగలం!"

"ఏం? మీ ప్రాజెక్టు వర్కు క్లయింటుకి నచ్చలేదా?"

"ప్రతీసారీ ఏవో మార్పులూ చేర్పులూ చెబుతూనే ఉంటారు. ఎలా చచ్చేది!"

"అయితే ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందా అన్నయ్యా?"

"ఎప్పుడూ ఉండే ప్రెషర్లేలే. అందరికీ సాఫ్ట్‌వేర్‌లో పెద్ద జీతాలే కన్పిస్తాయి కాని కష్టాలూ ఒత్తిళ్ళూ అర్థం కావు. అమెరికా క్లయింట్ల టైమింగ్సుకి అనుకూలంగా పనిచెయ్యాలి. అర్థరాత్రీ అపరాత్రీ అని లేకుండా కాల్స్ తీసుకోవాలి. ఈ మధ్య సాటర్‌డేస్ కూడా వెళ్ళాల్సి వస్తోందిరా. మీకే నయం. అమెరికాలో హాలిడేస్‌లో పనిచేయక్కర్లేదు గనుక వీకెండ్స్ చక్కగా ఎంజాయ్ చేస్తారు!"

నవ్వేడు స్వామి "అందుకే సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అంటారు"

"ఇంతకీ మీరొస్తున్నారా లేదా?"

"నాన్నగారు రమ్మన్నాక తప్పదు కదా, వస్తాం. మీరూ రండి అన్నయ్యా"

"వస్తాంలే. ఆసరికి ప్రాజెక్టు డెలివరీ అయిపోతుందనుకుంటున్నాను" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు రాఘవ.

* * *

హైదరాబాద్‌లో విమానం దిగి తిన్నగా అత్తవారింటికెళ్ళారు స్వామి, శ్యామల.

రితీష్‌ని దగ్గరకి తీసుకోవాలని చూసింది అత్తగారు. వాడు వెళ్ళలేదు. ఆమె వంక కన్నెత్తి చూళ్ళేదు. ఎంతగా ప్రయత్నించినా నోరు విప్ప లేదు. పిలిచినా పలక్కుండా తనని కానట్టుగా ఉండిపోయాడు.

"నీ కొడుకు మూగిలా మడ్డీగా ఉన్నాడేంటే శ్యామలా!"

సర్రున కోపం వచ్చేసింది శ్యామలకి. "ఇంకో మాటంటే వూరుకోను..." వాణ్ణి ఎత్తుకుని గదిలోకి తీసుకుపోయింది.

అవాక్కయ్యిందావిడ.

ఇంటికి ఫోన్ చేసి తాము వచ్చినట్లు చెప్పాడు స్వామి. ఎంతగానో పొంగిపోయింది

తల్లి.

"మనింటికెప్పుడొస్తున్నార్రా?"

"ఫ్యామిలీ ఫంక్షన్ మే 9న కదా, ఇంకా నెలరోజులు టైముంది. ఈలోగా ఇక్కడి పనులూ, తిరుపతి ప్రయాణమూ, అన్నీ చూసుకుని వస్తాం"

"నీ ఇష్టంరా" నిష్ఠూరంగా అంది.

మరేమీ అన్లేక తండ్రితో మాట్లాడాడు. ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశాడు.

"నాకేంరా నిక్షేపంలా ఉన్నాను. రమ్మనగానే దూరాభారాలు లెక్క చేయకుండా వచ్చారు. సంతోషం. మీ రాక కోసం ఎదురు చూస్తూంటాం..." అన్నారాయన.

"మనం వచ్చేవారమే మా ఇంటి కెళ్తే బావుంటుంది శ్యామలా" భార్యతో అన్నాడు.

"ఆ పల్లెటూళ్ళో నాకు ఊపిరాడదు బాబూ. అక్కడ రోజుకి 15 గంటలు కరెంటు కట్ అంట తెలుసా? అయినా అక్కడేం ముంచుకు పోతోందని పరుగెత్తుకెళ్ళాలి? ఫంక్షన్‌కి రమ్మన్నారు. ఫంక్షన్‌కి వెళ్తాం, దట్సాల్" విసుగ్గా విసురుగా అంది.

"మా నాన్నగారికి ఆపరేషన్ చేశారు కదే. ఇండియాకి వచ్చేక కూడా వెళ్ళి చూడకపోతే బావుండదు..." నచ్చ చెప్పాలని చూశాడు.

"ఎందుకు బాగుండదూ అదే బాగుంటుంది లెండి. పిల్లిలా పిల్లాణ్ణి చంకనేసుకుని అటూ ఇటూ తిరగటం నా తరం కాదు. వచ్చేవారం మా బాబాయిగారి మనవడి బర్త్‌డే. గ్రాండ్‌గా హొటల్లో చేస్తున్నారు. రమ్మని మరీ మరీ పిలిచింది పిన్ని. ఆ పై వారం తిరుపతి వెళ్తాం. అక్కడ్నుంచొచ్చేక మా మావయ్యగారమ్మాయి సీమంతానికి వెళ్ళాలి. దాని పెళ్లికి మనం ఎలాగూ రాలేదు. ఇప్పుడూ ఎలా మిస్సవుతాం? అవన్నీ చూసుకుని మే ఒకటి రెండు తారీఖుల్లో మీ ఊరెళ్దాం..."

ఆమె మాటకి ఎదురు చెబితే అరచి గోల చేస్తుంది. ఉక్రోషంతో ఊగిపోతుంది. ఏడుపూ పిలవకుండానే వచ్చేస్తుంది.

నిస్సహాయంగా చూస్తుండిపోయాడు స్వామి.

* * *

స్వామి తండ్రి బలరామయ్య హెడ్మాస్టారుగా చేసి రిటైరయ్యారు. పల్లెలోని తమ పాత ఇల్లు కూలిపోవడంతో దాని స్థానే చిన్న డాబా కట్టారు. సుమారు రెండెకరాలతోట మధ్యలో ఉంటుందా ఇల్లు. ఈశాన్యంలో చిన్న చెరువు కూడా ఉంది. ఇంటి వెనుక పశువుల కొట్టం ఉంది. అందులో రెండు గేదెలు, ఒక ఆవు ఉన్నాయి.

తోటలో మామిడి, వేప, కొబ్బరి చెట్లున్నాయి. ఇంటి చుట్టూ పూల, కాయగూరల మొక్కలున్నాయి.

వాన నీటిని ఒడిసి పట్టుకుని భూమిలోకి ఇంకేలా ఇంటి ప్రక్కనే పెద్ద ఇంకుడు

గుంత ఏర్పాటు చేశారు. ఇంట్లో వాడిన నీరంతా మొక్కలకు వెళ్ళేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఇంటి ముందు సిమెంటు బెంచీలున్నాయి. గ్రామస్తులొచ్చి కూర్చుని, పేపర్లు తిరగేస్తూ, మంచీ చెడూ మాట్లాడుకుంటారు. రాజకీయాలు చర్చిస్తారు.

ఇంట్లో టీవీ, ఫ్రిజ్‌లాంటి ఆధునిక సౌకర్యాలూ ఉన్నాయి.

ఇంటి ముందు కారు దిగారు స్వామి, శ్యామల, రితీష్. ఎండనపడి వచ్చారేమో చల్లని గాలి తగిలేసరికి ఆహ్లాదం అనుభూతించారు.

బలరామయ్య ఎదురొచ్చి ఆహ్వానించారు. రితీష్‌ని ఎత్తుకోబోయారుగాని వాడు దగ్గరకి రాలేదు. పలకరించినా కళ్ళెత్తి ఆయన వంక చూడలేదు!

"మూడేళ్ళునిండాయి కదురా, ఇంకా మీకు అతుక్కుపోయే ఉంటున్నాడా?!"

"ఇక్కడి పిల్లల్లా అమెరికా పిల్లలు అందరి దగ్గరకూ వెళ్ళరు. అందరిళ్ళకూ వెళ్ళరు. అందర్తో కలవరు. రాచుకు పూచుకు తిరగరు. ఎవరినీ ఇబ్బంది పెట్టరు" రితీష్‌ని దగ్గరకి లాక్కుంటూ కించిత్తు ఉక్రోషంతో గొప్పగా చెప్పింది శ్యామల.

"ఇల్లే లోకమన్నమాట!"

"ఐప్యాడ్లూ ఐఫోన్లూ ఉంటే చాలు, వీళ్ళకింకేం అక్కర్లేదు" వ్యాఖ్యానించాడు స్వామి.

"మీ నాన్నని చూట్టానికి ఇప్పటికి తీరిక చిక్కిందన్న మాట!" కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిస్తూ అంది తల్లి.

మాట మార్చడానికి, "అన్నయ్యా అక్కయ్యా వదినా అంతా వచ్చేశారా అమ్మా" అనడిగాడు.

"అక్క, బావ, చెల్లి, పిల్లలూ వచ్చారు. అన్నయ్యా, చిన్న బావా రేపొస్తున్నారు..."

పాలేరు అందరికీ కొబ్బరి బొండాలు తెచ్చిచ్చాడు. "అమృతంలా ఉంది" అంటూ ఇంకోటి తాగింది శ్యామల.

స్వామి రితీష్‌కి పట్టించబోయాడు గాని తేడా చేస్తుందంటూ వారించిందామె.

"ఇప్పుడే తీసిన లేత కొబ్బరి నీళ్ళు గ్లూకోజ్ కన్నా మంచివి తల్లీ" అన్నారు బలరామయ్య. ఆమె పట్టించుకోలేదు.

మర్నాటికందరూ వచ్చేశారు.

స్వామి అన్నా వదిన, అక్కా బావ, చెల్లెలు ఆమె భర్త, వారి పిల్లలు – అందర్తో ఇల్లు తొడతొక్కిడిగా ఉంది. ఏదో పెద్ద శుభకార్యం జరగబోతున్నట్టుగా ఉందందరికీ. స్వామి తల్లి లలితాంబ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

పిల్లలంతా కలిసి ఇంట్లోనూ బయటా రకరకాల ఆటలు ఆడుకోసాగారు. రితీష్‌నీ కలుపుకోవాలని పలు రకాలుగా ప్రయత్నించి విఫలురయ్యారు.

వెళ్ళి శ్యామలకి పితూరీ చేశారు. "మీ మట్టి ఆటలూ, ముదురు మాటలూ వాడికెందుకులే" అంటూ లోపలికి తీసుకెళ్ళి ఐ ప్యాడ్‌లో రంగులూ పండ్లపేర్లూ చూపిస్తూ నేర్పసాగింది.

రితీష్ పిల్లల్తో కలవలేకపోతున్నాడు. నోరు విప్పి మాట్లాడలేక పోతున్నాడు. కాని దూరంగా నిలబడి వారి ఆటపాటలు చూసి ఆనందిస్తున్నాడు. అది గమనించి బుజ్జగించసాగారు బలరామయ్య.

"మాతో ఆడుకోమని రితీష్‌కి చెప్పు తాతా" అన్నారు పిల్లలు.

"అమెరికా వాడు కదా. మన భాష వెంటనే అర్థంకాదు. మెల్లగా అన్నీ నేర్పుదాంలే" అన్నారాయన.

పిల్లలంతా హాల్లోని పెద్ద ఫొటోలు చూసి వాదించుకోసాగారు.

"దేని గురించర్రా" అటుగా వచ్చిన బలరామయ్య అడిగారు.

"ఈ ఫొటోలు ఎవరివి తాతయ్యా" పెద్ద మనవడు ఆకాశ్ అడిగాడు.

"మా అమ్మా నాన్నలవీ, మా అత్తా మావలవీనూ"

"ఎందుకు పెట్టుకున్నారు?"

"పెద్దవాళ్ళని ఎప్పుడూ మరచిపోకూడదని, ఎల్లప్పుడూ వారికి కృతజ్ఞులుగా ఉండాలని వారి ఫొటోలు పెట్టుకున్నాను. నాకు జన్మనిచ్చిందీ, నా జీవితాన్ని తీర్చిదిద్దే చదువూ సంస్కారాన్నీ ఇచ్చిందీ వీరే కదా. నేనిలా ఆరోగ్యంగా ఉన్నానూ అంటే దానిక్కారణం వారి ద్వారా సంక్రమించిన జీన్స్రా!" నవ్వేరు.

"మరి మీ ఫొటోలు మా ఇంట్లో లేవేం తాతా. మీరు మా అమ్మకి నాన్న కదా?" సందేహం వెలిబుచ్చాడు.

"వాళ్ళకి అవసరం అనిపించలేదేమోరా!"

"అయితే మేం పెద్దయ్యాక మా ఇంట్లో మీ ఫొటోలూ, మా అమ్మానాన్నల ఫొటోలూ పెడతాను తాతయ్యా"

మిగతా పిల్లలకి అర్థంగాకపోయినా వాళ్ళూ ఆకాశ్‌ని సమర్థిస్తూ తలలాడించారు.

వాడి తల నిమిరి మురిసిపోయారు బలరామయ్య.

మూడోరోజున రితీష్ 'తాత' అనటం విన్నది శ్యామల. పరమానందపడిపోయి ముద్దులు పెట్టుకుంది. అంతటితో ఆగలేదు. వాడిని స్వామి దగ్గరకి తీసుకెళ్ళి "తాత అంటున్నాడండీ" అని చెప్పింది బోలెడు సంబరపడిపోతూ.

అందులో చిత్రమేముందన్నట్టు చూశారు అక్కడున్న మగాళ్ళు.

"నిజవాఁ? మళ్ళీ అనరా అను...తా...త..." పొంగిపోతూ చెప్పాడు స్వామి.

బలరామయ్యని చూపిస్తూ, ''తాత'' అన్నాడు రితీష్. వాణ్ణి వాటేసుకుని

మురిసిపోయాడు స్వామి.

"నువ్వు మూగ అనుకుంటున్న వారి చెంప చెళ్ళుమనేలా మళ్ళీ అనరా, మళ్ళీ మళ్ళీ అనరా రితీష్..." అంది స్వరం పెంచి శ్యామల.

రితీష్‌కి నాలుగో ఏడు వచ్చేసినా మాటలు రావట్లేదని తోడికోడలూ, చిన్న ఆడబడుచూ చెవులు కొరుక్కోవడం విన్నప్పట్నుంచీ తనలో తను రగిలి పోతోందామె!

"అదేం మాట అమ్మాయ్. కొందరికి మాటలు కొంచెం ఆలస్యంగా వస్తాయి. ఆ మాత్రానికే మూగ అనటం అనుకోవడం తప్పు" అంటూ ముందుకొచ్చి రితీష్‌ని ఎత్తుకుని బయటికి తీసుకెళ్ళారు బలరామయ్య.

వాడికి చెట్లనీ కాయల్నీ పువ్వుల్నీ పశువుల్నీ పిట్టల్నీ చూపిస్తూ, పదే పదే చెబుతూ, వాడితో వాటి పేర్లూ ధ్వనులూ చెప్పించడానికి ప్రయత్నించసాగారు. అలాగే బెరుకు, సంకోచం పోగొట్టి మిగతా పిల్లల్తో కలపడానికీ కృషి చెయ్యసాగారు.

* * *

ఊరి వాళ్ళొచ్చి స్వామి తదితరుల్ని పలకరించారు. యోగక్షేమాలు కనుక్కున్నారు. వారు వృద్ధిలో కొచ్చినందుకు, అమెరికా దాకా ఎదిగినందుకు తమ సంతోషం వ్యక్తపరిచారు. ఊళ్ళో ఏర్పాటు చేయబోయే రక్షితనీటి పథకానికి ఆర్థిక తోడ్పాటు అందించమని అర్థించారు. తప్పకుండా ఓ చేయి వేస్తామని హామీ ఇచ్చాడు స్వామి.

వారు బలరామయ్యగారి జీవన దృక్పథాన్ని వేనోళ్ళ పొగిడారు. ఆయన తమకీ ఊరుకీ పెద్ద అండ అనీ, ప్రతిదానికీ ఆయన సలహా సహకారాలు తీసుకుంటామనీ చెప్పారు.

పిమ్మట స్వామి, అతడి అన్న రాఘవ తోటలోకి షికారు వెళ్ళారు.

"పండగ అన్చెప్పి మనందర్నీ నాన్నగారు ఎందుకు పిలిచారో నీకేమైనా తెలుసా స్వామీ" రాఘవ అడిగాడు.

"సరిపోయింది. అప్పుడు నేను నిన్ను అడిగితే, ఇప్పుడు నువ్వు నన్నడుగుతున్నావా అన్నయ్యా!" నవ్వేడు.

"ఏదో గట్టి పాయింటు ఉండకుండా ఉండదు"

"ఆపరేషన్ అయ్యిందిగా. అందర్నీ చూడాలన్పించిందేమో అన్నయ్యా"

"కావొచ్చు. ఒకరకంగా చచ్చి బ్రతికినట్టేలే. చిత్రం ఏంటంటే ఆపరేషన్ థియేటర్‌కి వెళ్ళేముందు కూడా నాన్నగారు నిబ్బరంగానే ఉన్నార్రా. ఏమాత్రం కలవరపళ్ళేదు. భయపళ్ళేదు"

"స్థితప్రజ్ఞుడంటారే దానికి నిదర్శనం నాన్నగారే"

"ఏమైనా, అతుకు అతుకేరా. ఎన్నాళ్ళు బతుకుతారో చెప్పలేం. అందుకని ఆస్తి పంపకాలకో, వీలునామా రాయడానికో పిలిచి ఉంటారు..."

"కొత్త చట్టం ప్రకారం అక్కకీ చెల్లికీ కూడా వాటా వస్తుందేమో?"

"వస్తుంది. ఇది వరకు వాళ్ళ పెళ్లిళ్ళలోనూ బాగానే ముట్టజెప్పారుగా. దాన్ని దృష్టిలో ఉంచుకుని వాటాలు వెయ్యమందాం"

తలాడించాడు స్వామి.

"మీవాడేమిట్రా పిలిచినా పలకడు. తనని కానట్టు నిలబడిపోతాడు తప్ప కనీసం తలెత్తి చూడడు. మాటలూ రావట్లేదు... ఎనీ ప్రోబ్లం?"

గతుక్కుమన్నాడు స్వామి. "అహహ, అలాటిదేం లేదన్నయ్యా. అమెరికాలోని ఇండియన్స్ పిల్లలంతా అంతే. ముఖ్యంగా మొదట అబ్బాయి పుడితే... అన్ని కుటుంబాలూ లోన్లీగా ఎవరికి వారే అన్నట్టు ఉంటారు. పైగా వింటర్లో అసలు ఇంట్లోంచి బయటికి రాలేరు. ఇతరులతో కలవడమూ తిరగడమూ ఉండదు. అందుకని ఒంటరిగానే ఉంటారు. ఒంటిగానే ఆడుకుంటారు. అదీగాక లాంగ్వేజ్ ప్రోబ్లం ఒకటి..." సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"కాదేమోరా. మేం బెంగుళూరులో ఉంటున్నాం. మా పిల్లలూ అక్కడే పుట్టారు. అయినా వాళ్ళకి ఇంట్లో తెలుగు, బయట కన్నడం, స్కూల్లో ఇంగ్లీషు నేర్చుకున్నారా లేదా? రితీష్‌కి ఏదో ప్రోబ్లం ఉందిరా. ఆటిజం లక్షణాల్లా ఉన్నాయి. ఏ చిల్డ్రన్ స్పెషలిస్టుకో, స్పీచ్ థెరపిస్టుకో చూపిస్తే మంచిది"

కళ్ళల్లోకి నీళ్ళు దుముకుతోంటే తలాడించాడు స్వామి. ఇంతలో తండ్రి ఎదురొచ్చారు.

"జమ్మిచెట్టుని చూశారా" తండ్రి మాటలకు గతుక్కుమని ముఖాముఖాలు చూసుకున్నారు అన్నదమ్ములు.

"ఇంకా లేదు... ఇప్పుడే వెళ్తాం..."

మరో వైపుకి తిరిగి, జమ్మిచెట్టు దగ్గరకి వెళ్లారు. దాని మ్రానుని పట్టుకుని ఆరాధనగా చూశారు.

చిన్నప్పుడు పండగలకీ వేసవి శలవుల్లోనూ ఇక్కడి కొచ్చేవారు. తాతయ్య కబుర్లు, నానమ్మ పాటలు వినేవారు. మిత్రుల్తో కలిసి తోటలో ఆడేవారు. కాలువలో ఈతలు కొట్టేవారు. చెమ్కీ కిరీటాలు పెట్టుకుని నాటకాలు వేసేవారు.

నాటి ఆటల్నీ పాటల్నీ వింతల్నీ విశేషాలనీ నెమరేసుకున్నారు అన్నదమ్ములు.

"ఆ రోజులెంత బాగుండేవో!" అన్నాడు స్వామి.

"బాల్యం బాల్యమే. బాల్యాన్ని ఎలాంటి ఆంక్షలూ బరువులూ ఒత్తిళ్ళూ లేకుండా హాయిగా స్వేచ్ఛగా గడిపిన ఆఖరి తరం మనదేనేమోరా!" సాలోచనగా అన్నాడు రాఘవ.

ఇద్దర్లోనూ కొత్త ఉత్సాహం పొంగింది. మరింత హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి తిరిగొచ్చారు.

“రితీష్‌ని పట్టించుకోకుండా ఎక్కడ షికార్లు కొడుతున్నారు?” శ్యామల నిలదీసింది.

ఎవరైనా విన్నారేమోనని తత్తరపడుతూ, “జమ్మిచెట్టు దాకా వెళ్లొచ్చాం” అన్నాడు స్వామి.

“అక్కడేం నిధులున్నాయిట?”

“అహహ అది కాదు. జమ్మిచెట్టు గొప్పతనం నీకు తెలీదు. దసరాలో జమ్మిచెట్టు రొబ్బతెచ్చి పాతి గుళ్ళల్లో పూజలు చేయిస్తూంటారుగా. మా నాన్నగారు ఏకంగా తోటలో జమ్మిచెట్టునే పాతేశారు. దసరాకి ఊరు ఊరంతా ఇక్కడి కొచ్చి పూజలు చేస్తుంది తెలుసా?”

“అలాంటివి నేను విన్లేదు లెండి...” మూతి ముడిచింది.

“పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్ళేముందు వారి అస్త్రశస్త్రాలనన్నిట్నీ జమ్మిచెట్టు మీదే దాచారు. తర్వాత అర్జునుడు వాటిల్లోంచి గాండీవాన్ని తీసుకుని ఉత్తర గోగ్రహణంలో విజయుడయ్యాడు. అందుకనే విజయదశమికి...”

“మీ కథలూ కాకరకాయలూ వినేంత ఓపిక నాకు లేదు గాని వీడ్ని తీసుకోండి చాలు” రితీష్‌ని అందించి లోపలి కెళ్ళిపోయింది శ్యామల.

* * *

పెద్ద కూతురు నీరజని తీసుకుని బలరామయ్య టౌన్ కెళ్ళారు. పండక్కి కావాల్సిన సరుకులూ, పిల్లలకీ ఆడబడుచులతో సహా ఆడవారందరికీ కొత్త బట్టలూ కొనుక్కొచ్చారు.

ఇంట్లో పండుగ పనులు మొదలు పెట్టేశారు ఆడవాళ్ళు.

బలరామయ్య నుదుట తిరునామాలు దిద్దుకుని పూజ చేసుకొంటోంటే వింతగా చూశారు పిల్లలు. తమకీ పెట్టమని అడిగి మరీ బొట్టు పెట్టించుకుని మురిసిపోయారు.

తల్లి చెయ్యి పట్టుకుని లాక్కొచ్చి పూజగది వంక విస్మయంగా చూపించింది అయిదేళ్ళ ఉషాబాల.

“మీ ఇంట్లో పూజామందిరం లేదేంటే రమా” బలరామయ్య అడిగారు చిన్న కూతుర్ని.

“పిచ్చుక గూళ్ళు లాంటి అపార్టుమెంట్లో పూజ గది కూడానా! హు!”

“వీలున్నంతలోనే ఏర్పాటు చేసుకోవాలి. అవి ఉంటేనే పిల్లలకి ఒక ఆసక్తి, ఒక అనురక్తి, ఒక అవగాహన ఏర్పడతాయి. లేకపోతే దేవుడు, సంస్కృతి, సత్ప్రవర్తన వారికి ఎలా తెలుస్తాయి చెప్పు! వారికవన్నీ నేర్పాల్సిన బాధ్యత మన మీద లేదూ?!”

ఆమె మూతి ముడుస్తూ వెళ్ళిపోయింది. పిల్లలందర్నీ పిలిచి కూర్చోబెట్టి బొట్టు ఎందుకు పెట్టుకోవాలో, దేవుడ్ని ఎలా పూజించాలో, రెండు చేతులూ జోడించి ఎలా నమస్కరించాలో వివరించారు బలరామయ్య.

పిమ్మట పిల్లలు కవ్వంతో మజ్జిగ చిలుకుతోన్న లలితాంబ దగ్గరికి పరుగెత్తారు. ఇంతింత కళ్ళతో అబ్బురంగా చూశారు. అందరికీ తలో కాస్త వెన్న పెట్టి "వెన్న బాలకృష్ణుడికెంతో ఇష్టమర్రా" అని చెప్పింది.

నెయ్యి ఎలా వస్తుందని అమల ప్రశ్నించగా వెన్నకాచి చూపించింది. గోదారి తిని మురిసిపోయారు పిల్లలు.

ఆ రాత్రి వెన్నెల్లో ఆరు బయట పిల్లల్నందర్నీ కూర్చో బెట్టి బలరామయ్య చందమామ కథలు చెబుతోంటే ఎంతో ఆసక్తిగా వినసాగారంతా. లలితాంబ తదితరులు వంటిల్లు సర్దివచ్చి వారి పక్కన చతికిలబడ్డారు.

శ్యామలకి నీటి మార్పు వల్ల కాబోలు జలుబు చేసి దగ్గుతోంది. "ఇక్కడ మందులు కూడా దొరకవు ఖర్మ" అని చిన్నగా సణిగింది.

పాలల్లో మిరియాలూ, శొంఠిపొడీ, పసుపూ వేసి, కాచి, తెచ్చిచ్చింది అత్తగారు. మరి పది నిమిషాలకే ఎంతో రిలీఫ్‌గా ఫీలై అత్తగారి వంక అభిమానంగా చూసింది శ్యామల.

రాఘవ, స్వామి, పెద్దబావ వెంకటేశ్వర్రావు, చిన్న బావ సందీప్ డాబా మీద పక్కలేసుకుని కబుర్లలో పడ్డారు.

"ఇన్వెస్ట్ చెయ్యగలిగితే ఇక్కడ పొలాలు కొనమంటున్నారు నాన్నగారు" రాఘవ అన్నాడు జనాంతికంగా.

"భూమి మీద పెడితే పెరుగుతుందేగాని ఎప్పటికీ తరగని మాట నిజమే. కాని, మనూళ్ళోనూ పొలాల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరం ఖరీదు 15 లక్షలంట!" ఆశ్చర్యంగా చెప్పాడు స్వామి.

"మెయిన్‌రోడ్ ప్రక్కన నలభై యాభై లక్షల దాకా పలుకుతోంది తెలుసా!" వెంకటేశ్వర్రావు అన్నాడు.

"ఈ మారుమూల పల్లెలో ఏం కొంటాం. ఇక్కడి కొచ్చి ఉంటామా ఏమన్నానా!"

రాఘవ మాటలకి సందీప్ స్పందించాడు. "మీరలా తీసిపారేస్తున్నారు గాని మీ నాన్నగారిలా రిటైర్మెంట్ లైఫ్ అనుభవించడం ఎంత మందికి సాధ్యం చెప్పండి? స్వంత తోటలో పర్ణశాలలాంటి ఇల్లు. తోటనిండా పండ్ల చెట్లు. ఇంటి చుట్టూ కాయగూరల మొక్కలు. ఇంటి వెనుక పాలిచ్చే పశువులు. ఇంటి ముందరి చెరువులో చేపలు. ఫ్రెష్ గాలి, నది నీరు – ఇది వైభోగం కాదా? నాకైతే జెలసీగా ఉంది"

"అది నిజమే. కరెంటు పోయినా ఇబ్బందిగా లేదు. అసలు ఇక్కడ మండు వేసవి అన్నదే గుర్తు రావట్లేదు. పచ్చని చెట్లు, పైరగాలి, పిల్లలు ఆడుకోడానికి కావాల్సినంత జాగా... రియల్లీ ఐడియల్ హౌస్" అన్నాడు స్వామి.

"నీ వాటాకి తీసుకుందువు గాన్లేరా. బావగారూ, మీ రైస్ మిల్లు బిజినెస్ ఎలా ఉంది?" రాఘవ ఆరా తీశాడు.

"తిండి గింజలు కదా మా బిజినెస్‌కి ఎప్పుడూ ఢోకా ఉండదు. ఫైనాన్స్ తక్కువగా ఉంది గాని, లేకపోతే ఉప్పుడు బియ్యం కేరళకి ఎక్స్‌పోర్ట్ చేసేవాణ్ణి. ఆఫ్రికా దేశాల్లోనూ డిమాండ్ ఉందంటున్నారు..."

"మీరు రైస్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్ స్టార్ట్ చేస్తానంటే నేను 20 లక్షల దాకా పెట్టుబడి పెడతాను. ఇంకా కావలిస్తే తమ్ముడూ పెడతాడు. చినబావా కలవ్వొచ్చు. జాయింట్ వెంచర్‌గా అయితే ఎలా వర్కవుట్ అవుతుందో ఆలోచించు బావా"

ఎగిరి గంతేశాడు వెంకటేశ్వర్రావు. "మా ఆడిటర్తో మాట్లాడి ప్రాజెక్ట్ డీటెయిల్స్ తయారు చేయిస్తాను. అందరం కలిసి కొత్త ఫర్మ్ పేరుతో బిజినెస్ ప్రారంభిద్దాం. అదృష్టం కలిసొచ్చిందా ఆ లాభాల ముందు మీ ఉద్యోగాలు బలాదూర్!"

తనూ వాళ్ళతో చేతులు కలిపితే ఎలా ఉంటుందా అని ఆలోచించసాగాడు స్వామి.

"పడుకున్నారా అన్నయ్యా" అంటూ డాబా మీదికొచ్చింది చెల్లెలు రమ.

"లేదు లేవే. రా రా..." లేచి కూర్చుంటూ అన్నాడు రాఘవ.

"మీకు తెలుసుగా అన్నయ్యా, మా మరిదిని మా ఇంట్లో ఉంచుకుని ఈయనే చదివిస్తున్నారు. ఇంటర్లోనూ ఎమ్సెట్‌లోనూ మంచి ర్యాంకులొచ్చాయి. కొంచెంలో ఐఐటి తప్పింది గాని బిట్స్ పిలానీ బీటెక్‌లో సీటొచ్చింది. ఏడాదికి రెండు లక్షల దాకా ఖర్చు అవుతుందిట. బ్యాంకు లోనుకి అప్లై చేశారు గాని అది కావాలి, ఇది కావాలంటూ తిప్పించుకొంటున్నారు. మీరేమైనా డబ్బు సర్దితే...లోన్ రాగానే తిరిగిచ్చేస్తాం. మెరిట్ స్టూడెంటన్నయ్యా" అర్థింపుగా అంది రమ.

"ఆర్దిక స్తోమతులేని మెరిట్ స్టూడెంట్సుకి సాయం చేసేవాళ్ళు చాలా మంది ఉన్నారు. చాలా సంస్థలూ ఉన్నాయి రమా. అమెరికాలోని అలాంటి కొన్ని సంస్థల గురించి నాకు తెలుసు. నీ మరిది వివరాలియ్యి, ఈ మెయిల్ ద్వారా పంపించి సమయానికి సాయం అందేలా చూస్తాను" అన్నాడు స్వామి ఉత్సాహంగా.

"నిజంగానా అన్నయ్యా?"

"అసలు బ్యాంకు లోను అవసరమే ఉండదు. నాలుగేళ్ళకీ సాయమందిస్తారు. మీ మావగారి ఆర్థిక పరిస్థితి నాకు తెలుసుగా. తప్పకుండా హెల్ప్ చేస్తారు, నిశ్చింతగా ఉండు"

బోలెడు సంబరపడిపోయింది రమ. "ఆ సాయం చేసి పుణ్యం కట్టుకోరా, చచ్చి నీ కడుపున పుడతానూ!"

* * *

బలరామయ్యగారి అక్కయ్య, తమ్ముడూ మరదలే కాదు వారింటి పేరుగల ఆడబడుచులు నలుగురొచ్చారు. ముఖ్యంగా బలరామయ్య గారి పెదతాతగారమ్మాయి గౌరమ్మ పడుతూ లేస్తూ వచ్చింది. ఆవిడకి తొంభైఏళ్ళుంటాయి. 'తలాటి' ఆడబడుచు అని గౌరవిస్తుంటారు.

ఇల్లంతా కొడుకులూ కూతుళ్ళూ కోడళ్ళూ అల్లుళ్ళూ వంశ ఆడబడుచులూ మనవలూ మనవరాళ్ళతో కళకళలాడుతోంటే లలితాంబకి పట్టరానంత ఆనందంగా ఉంది. 'దేవుడు దిగివచ్చి అడిగినా ఇంతకంటే ఏమీ కోరుకోను' అంటోంది పదే పదే.

అందరికీ తలంటు పోస్తూ, "సంక్రాంతి పండుగ మళ్ళీ వచ్చినట్టు ఉంది" మహదానందంగా అందామె.

తల స్నానాలు చేసి, కొత్త బట్టలు కట్టుకున్నారంతా. ఆడబడుచులు ఆనందోద్విగ్నులై కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

పెసరట్టు, ఉప్మా, అల్లం చెట్నీ – ఆహా ఓహో అంటూ తిన్నారంతా. "గ్రీన్ దోసె చాలా బావుంది" అన్నారు పిల్లలు.

ఒంటి గంటకి హాలులో జింఖానా పరచి అందరికీ ఒకే మారు భోజన ఏర్పాట్లు చేశారు.

వరుసగా అరటి కొసాకు విస్తర్లు వేశారు. కొబ్బరి తీపి పచ్చడి, దోసకాయ పచ్చడి, గుత్తివంకాయ కూర, పనసపొట్టు కూర, బంగాళాదుంప కుర్మా, సుద్దపప్పు, గారెలు, పరమాన్నం, పులిహోర, పూతరేకులు, మామిడిపండు వడ్డించారు. గుమ్మడికాయ దప్పళం, అన్నం, గడ్డ పెరుగు విడిగా పెట్టారు.

ఆడా మగా అంతా కూర్చున్నారు. శ్యామల అయిష్టంగానే చతికిలబడింది. నోరూరిస్తోన్న వంటకాల వంక చూసి థ్రిల్లయ్యారు.

"విందు భోజనంలా ఉంది" "పూర్వం పెళ్ళిళ్ళలో విస్తరి ఇలా నిండుగా ఉండేది" "కడుపు అరువు తెచ్చుకోవాలన్పిస్తోంది" "మృష్టాన్నభోజనం అంటే ఇదేనా?" "ఇన్ని చేసిన అమ్మకి థాంక్స్" – రకరకాలుగా స్పందించారు. పిల్లలు 'ఇవన్నీ తినడానికేనా' అన్నట్టు చూశారు.

"ఇక ప్రారంభించండి. ముందుగా భగవంతుణ్ణి ప్రార్థించి తృప్తిగా భోంచేయండి" అన్నారు బలరామయ్య.

"ఇవన్నీ దేవుడు తిండాటా?" విస్మయంగా చూస్తూ అడిగింది మనవరాలు అనూష.

నవ్వేరాయన. "భయపడొద్దు. దేవుడేమీ తినడు. మనం తినడానికి ఇవన్నీ ఇచ్చింది భగవంతుడే. మనం తింటే తన కడుపు నిండిపోతుంది. అందుకని మొదట ఆ దేవదేవుడికి కృతజ్ఞతలు తెలియజేసుకోవాలి"

"అప్పుడు దేవుడు సంతోషించి మనకి బోలెడు బోలెడు ఇస్తాడు"

ఆకాశ్ మాటలకు హాయిగా నవ్వారంతా.

"ఇన్ని స్వీట్లు తింటే లావెక్కిపోతాం" అంది శ్యామల.

"పండక్కీ పబ్బానికీ తింటే ఏం కాదు. కాస్త నెయ్యి కూడా వేసుకో" అంది లలితాంబ. తిరిగి తనే అంది "ఇలా ఇల్లంతా నిండుగా కళకళ్ళాడి ఎన్నేళ్ళయ్యిందో!"

"ఈ గొప్పతనమంతా కుటుంబ వ్యవస్థదేనే. ప్రతి వ్యక్తి విజయానికీ మూలం కుటుంబమే. కుటుంబమిచ్చే ప్రోత్సాహం, భరోసా అంతా ఇంతా కాదు. విజయాలకి వెన్ను చరిచి, వైఫల్యాలకి వెన్ను తట్టి, సమస్యల్ని సానుకూలపరచి ముమ్ముందుకు నడిపించేదీ, మార్గదర్శనం చేసేదీ కుటుంబమే. నా వెనుక నాకోసం అమ్మా నాన్న అన్న అక్క బావ తమ్ముడు భార్య బిడ్డలు అంతా ఉన్నారన్న భావమే కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. అభద్రతని దూరం చేస్తుంది. ఒకరికొకరు చేదోడు వాదోడవటంలోనే కలిమి, బలిమి ఉన్నాయి" వివరించారు బలరామయ్య.

"చిన్నన్నయ్య మా మరిది చదువుకి చక్కని పరిష్కారం చూపించాడు నాన్నగారూ" రమ చెప్పింది.

"నా వ్యాపారాన్ని మరింతగా విస్తరించడానికి రాఘవ నాతో చేతులు కలుపుతానన్నాడు మావయ్యగారూ" అన్నాడు వెంకటేశ్వర్రావు.

"కష్టం వస్తే సలహా. నష్టం వస్తే ఓదార్పు. అంతకంటే ఏం కావాలి చెప్పండి? కానొక్క సంగతి. డబ్బు, ఆస్తులు అయిన వాళ్ళని విడదీయడానికి చూస్తాయి. వాటి ఉచ్చులో పడకుండా అనురాగాలకీ, అనుబంధాలకీ పెద్దపీట వేయాలి. అప్పుడంతా కలిసి ఆనందామృతాన్ని దోసిళ్ళతో జుర్రుకోవచ్చు"

తండ్రి మాటలకు కంగారు పడ్డాడు రాఘవ. పొలమారింది. ప్రక్కనే ఉన్న బలరామయ్య నీళ్ళ గ్లాసందించి, తల మీద 'చిరంజీవ' అంటూ చిన్నగా చరిచారు. అతడి కళ్ళల్లో సన్నని కన్నీటి పొర కదిలీ కదలనట్టు కదిలింది.

తమ కాలపు విశేషాలు తలచుకుంటూ, అప్పటి అచ్చట్లూ ముచ్చట్లూ ఉత్సాహంగా వివరించింది తలాటి ఆడబడుచు గౌరమ్మ.

'అప్పుడలా ఉండేదా!' అనుకుని ఆశ్చర్యబోయారు చిన్నవాళ్ళు.

"అప్పటి ఉమ్మడి కుటుంబాల్లో రోజూ పండగలానే ఉండేది" అంది బలరామయ్యగారి అక్కయ్య ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ.

"ఇంతకీ ఇవాల్టి ఈ పండుగేమిటో, దీని విశిష్టతేమిటో చెప్పలేదు నాన్నగారూ" భోంచేస్తూ అడిగాడు స్వామి.

"అందరం కలవడమే పండుగ. అయిన వాళ్ళందరూ కలవడం, కష్టసుఖాలు కలబోసుకోవడం, ఒకరికొకరు సాయ సంపద లందించుకోవడం, అండగా మేమున్నామన్న భరోసా కల్పించడం, సంతోషాన్ని పెంచుకుని పంచుకోవడం – ఇదే పండుగల పరమార్థం. ప్రపంచంలోని ఏ జాతికీ లేనన్ని పండుగలు మనకున్నాయంటే మన సంస్కృతి, మన సంప్రదాయం ఎంత గొప్పదో, ఎన్ని నేర్పుతోందో మీరే ఆలోచించండి"

"పూర్వం ఎక్కడున్నా ఎలా ఉన్నా సంక్రాంతి పండక్కి ఇంటిల్లపాదీ ఒక్కచోట చేరి సమష్టిగా సంబరాలు చేసుకునేవారు" చిన్ననాటి వూసులు గుర్తు చేసుకుంటూ అంది బలరామయ్య గారి అక్క.

"ఇప్పుడూ అలాగే మనమంతా ఏడాది కొక్కసారైనా కలవాలి. ఫలానా పండక్కి అని గాక ఫలానా రోజున అని బొట్టుపెట్టి పండుగ చేసుకుందాం. చదువులకి ఇబ్బంది రాకుండా మే నెల రెండవ శనివారం నాడు ఇలా అందరం కలుద్దాం. పిల్లలకి వేసవి శలవులుంటాయి గనుక పదిరోజులుండటానికీ వీలు చిక్కుతుంది..."

ఎవరూ మాట్లాడలేదు. మౌనంగా ఉండి పోయారంతా.

ఒక నిమిషమయ్యాక తిరిగి బలరామయ్య అన్నారు "ఎవరూ దూరాభారం అనుకోవద్దు. దీనివల్ల మీకే కాదు మీ పిల్లలకూ ఎంతో ప్రయోజన ముంటుంది. అనుబంధాల విలువ తెలుస్తుంది. అందరితో తేలిగ్గా అల్లుకుపోతారు. పుట్టినమట్టితో ఇక్కడి జనంతో అనుబంధం పెరుగుతుంది. మీరు కూడా ఉత్తేజితులవుతారు. మనం ఒక్కరం సంతోషంగా ఉంటే చాలదు. దాన్ని నలుగురికీ పంచాలి. నలుగుర్తో పంచుకోవాలి. 'నా' నుంచి 'మనం' దాకా ఎదగాలి. ఆ తర్వాత దాని పరిధి ఎంత విస్తృతమవుతుందో, ఎంత ఆనందాన్నీ తృప్తినీ ఇస్తుందో మీరే చూద్దురు గాని!"

అందరి భోజనాలూ అయ్యాయి. అయినా ఎవరూ విస్తరి ముందు నుంచి లేవలేదు.

"ఎంతో అభిమానంతో తన మన అని లేక మన వంశ ఆడబడుచులందర్నీ పుట్టింటికి పిలిచి, కొత్త చీరపెట్టి, చక్కని భోజనం పెట్టావు. ప్రతీ ఏటా మమ్మల్నందర్నీ ఇలాగే రమ్మంటున్నావు. నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు వర్ధిల్లరా బలరాముడూ" అంది కళ్ళొత్తుకుంటూ బలరామయ్యగారి అన్నగారి పెద్దమ్మాయి.

"అనుబంధాలనీ ఆప్యాయతల్నీ అభిమానాలనీ జమ్మిచెట్టు మీద దాచేసి బతుకుకోసం, కుటుంబంకోసం దూరతీరాలకు వెళ్ళిపోయారు. అయినా మీకు చెందిన ఈ బాంధవ్యాలన్నీ ఇక్కడే జమ్మిచెట్టు మీదే భద్రంగా ఉన్నాయి. ఆ సంగతి ఎప్పుడూ మరచిపోకండి"

బలరామయ్య స్వరం కంపించింది. అంతా తుళ్ళిపడి ఆయన వంక చూశారు.

"పుట్టిన ఊరునీ, ఇక్కడి జనంతో మీ అనుబంధాన్నీ మీ జీవితాంతం కొనసాగించాలి. మీ వేళ్ళు ఇక్కడే ఉన్నాయని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. ప్రతి ఏడాదీ ఎన్ని పనులూ బాధ్యతలూ ఉన్నా సరే, ఇదే రోజున ఇక్కడ కలుస్తామని, మా తదనంతరం కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని నాకు మాట ఇవ్వండి" అందరి వంకా కలయ జూస్తూ అడిగారు బలరామయ్య.

"తప్పకుండా వస్తాం" అన్నారంతా – కొందరు మనస్ఫూర్తిగా, మరికొందరు మొహమాటంగా.

"ఊరికే రావటం కాదు. అయిన వాళ్ళందర్నీ కలవడానికి, కలుపుకోడానికి, కలిసి పోవడానికి వస్తున్నామని, మనకోసం మన భావి తరం కోసం, అనుబంధాలనీ ఆత్మీయతల్నీ పదిల పరచుకోవడం కోసం, మనం ఈ పండుగలో భాగస్వామ్యం అవుతున్నామని, ఈ రకంగా ఓ మహా పరంపరని కొనసాగిస్తున్నామని సదా జ్ఞాపకం ఉంచుకోండి!"

తలలాడించి లేచారంతా.

"నిజం చెబుతున్నాను. నాకెంతో రిలీఫ్‌గా ఉంది. నాలుగు రోజులు మీ అందరితో గడిపినందున ఎంతో హాయిగా ఉత్సాహంగా ఉంది. నిజంగా రీచార్జి అయ్యానంటే నమ్మండి నాన్నగారూ" అన్నాడు రాఘవ. గుండెలోతుల్లోంచి వచ్చాయా మాటలు!

ఆ రాత్రి శ్యామల స్వామితో అంది "ఏవిటో అనుకున్నాను గాని ఈ వారం రోజుల్లోనే రితీష్‌లో చాలా మార్పు వచ్చింది. కళ్ళల్లో మెరుపూ ఒంట్లో ఉత్సాహం పెరిగాయి. చురుగ్గా ఉంటున్నాడు. మాటలూ వస్తున్నాయి. పిలిస్తే రెస్పాండవుతున్నాడు. పిల్లల్తో కలసి ఆడుకుంటున్నాడు. పిల్లలంతా ఈ నెలాఖరు దాకా ఉంటారట. మనమూ ఉందాం. సెలవు పొడిగించండి. ఈ అనుభవం కొత్తగా గొప్పగా ఉంది. ప్రతీ ఏటా తప్పకుండా వద్దాం!"

భార్యలో వచ్చిన మార్పుకి పరమానంద పడుతూ తలూపాడు స్వామి.

'కలిసి ఉంటే సంకుచితత్వం తగ్గి, పంచుకునే మనస్తత్వం పెరుగుతుందని అంటారిందుకే కాబోలు. ఏమైతేనేం, ఇంత చక్కని కుటుంబం ఇచ్చి నన్ను భాగ్యవంతుణ్ణి చేసినందుకు, దేవుడూ! నీకు వేనవేల వందనాలు!' అనుకున్నాడు మనస్సులో.

పదిహేను రోజుల తర్వాత అమెరికా ప్రయాణమై వెళ్తూ అందరి దగ్గరా సెలవు తీసుకుంటున్నారు స్వామి, శ్యామల.

గబుక్కున ముందు కెళ్ళి నానమ్మ, తాతయ్యలకు పాదాభివందనం చేశాడు రితీష్!

* * *

**(ఆంధ్ర సారస్వత సమితి–2016)**